సామాన్యుడి ఆయుధం

# తెలంగాణ ప్రభ

సోమవారం, జూన్ 17, 2024

డిజిటల్



# బొగ్గు తరలింపు ఆర్థిక భారం కదా?

## కేసీఆర్‌పై జీవన్‌రెడ్డి ఫైర్

- నరసింహారెడ్డిని వైదొలగమనడానికి నువ్వెవరు?
- కేసీఆర్ తీరు దొంగే పోలీస్ లను బెదిరిచ్చినట్టు ఉంది..
- విచారణకు సహకరించకపోవడమే కేసీఆర్ నేరాన్ని అంగీకరించినట్టే..

తెలంగాణ ప్రభ, జగిత్యాల : బొగ్గు తరలింపు ఆర్థిక భారం కదా? అని కేసీఆర్ పై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నరసింహారెడ్డిని వైదొలగమనడానికి నువ్వెవరు అని ప్రశ్నించారు. కేసీఆర్ తీరు దొంగే పోలీస్ లను బెదిరిచ్చినట్టు ఉందన్నారు. కేసీఆర్ పై విచారణ కక్ష సాధింపు కాదన్నారు. విచారణకు సహకరించకపోవడమె కేసీఆర్ నేరాన్ని అంగీకరించినట్టే అన్నారు. విచారణ అధికారి నరసింహారెడ్డికి కేసీఆర్ భయపడుతున్నాడని కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ వ్యవస్థను కేసీఆర్ కించపరుస్తున్నాడని తెలిపారు.

విద్యుత్ ప్రాజెక్ట్ లలో ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ అంటూ కేసీఆర్ కొత్త నినాదం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు లభ్యత ఉన్న రామగుండంలో కాదని దామరాచర్లలో యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మిస్తారా? బొగ్గు తరలింపు ఆర్థిక భారం కదా? అని ప్రశ్నించారు. కేసీఆర్కె తప్పుడు ఆలోచనతో రాష్ట్ర ప్రజానీకంపై 40 వేల కోట్ల భారం పడిందన్నారు. సోలార్ పవర్ తో యూనిట్ 3 రూపాయలకె విద్యుత్ లభిస్తుంది.. యాదాద్రి థర్మల్ పవర్ తో రాష్ట్ర ప్రజానీకంపై భారం పడుతుందన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ అసలు అవసరం లేదన్నారు. నరసింహారెడ్డి నివేదికతో కేసీఆర్ కు భయం పట్టుకుందని సంచలన వ్యాఖ్యలు చేశారు.

మరోవైపు విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాసిన లేఖ పై విద్యుత్ కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ లేఖ పై నిపుణులతో చర్చిస్తామన్నారు. లేఖలో కేసీఆర్ పలు అంశాలను ప్రస్తావించారని, కొన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చారని తెలిపారు. కేసీఆర్ చెప్పిన వివరాలను వాస్తవాలతో పోల్చి చూడాలని అన్నారు. బి హెచ్ ఇ ఎల్ ప్రతినిధులను కూడా వాస్తవాలపై వివరాలు అడుగుతారు. కేసీఆర్ అభ్యంతరాలపై పునరాలోచన చేస్తామన్నారు. కేసీఆర్ రాసిన లేఖపై సమీక్ష నిర్వహించనున్నారు. తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.



## జగిత్యాల కలెక్టర్‌గా సత్యప్రసాద్ బాధ్యతలు

తెలంగాణ ప్రభ (కోరుట్ల) : రాష్ట్రంలో కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో షేక్ యాస్మిన్ బాషా ను బదిలీ చేస్తూ, ఆమె స్థానంలో బి.సత్యప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఆదివారం రోజున ఐడీఓసీలో బదిలీపై వెళ్తున్న షేక్ యాస్మిన్ బాషా నుండి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కొత్త కలెక్టర్‌కు పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.రాంబాబు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పి.మధుసూదన్, ఆనంద్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ

WANTED

సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్: 99854 44342

# కాళేశ్వరం వివరాలు ఇవ్వండి..



- నిర్మాణ సంస్థలను కోరిన జస్టిస్ పినాకి..
- కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ- అన్నారం- సుందిళ్ల బ్యారేజీలు నిర్మించాయా?
- కాంట్రాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారా?
- మూడు బ్యారేజీల నిర్మాణ పనుల్లో కనీసం 15 మంది సబ్ కాంట్రాక్టర్లు
- దీనిపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** కాంట్రాక్టులు పొందిన నిర్మాణ సంస్థలు కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించాయా? లేక కాంట్రాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారా? దీనిపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ జరుపుతోంది. మూడు బ్యారేజీల నిర్మాణ పనుల్లో కనీసం 15 మంది సబ్ కాంట్రాక్టర్లు పాల్గొన్నట్లు కమిషన్ కు కొన్ని ఆధారాలు సమర్పించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ముఖ్యమైన పదవిలో ఉన్న ఓ నాయకుడి సమీప బంధువుకు చెందిన ఓ కంపెనీ బ్యారేజీల పనులను కూడా సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న సంగతి తెలిసిందే.

దీంతో సబ్ కాంట్రాక్టర్ల వివరాలను సమర్పించాలని బ్యారేజీ నిర్మాణ సంస్థలను కమిషన్ ఆదేశించింది. నిర్మాణ సంస్థలు సబ్ కాంట్రాక్టర్ల వివరాలను సమర్పించకుంటే.. గత పదేళ్ల ఆర్థిక నివేదికలను సమర్పించాలని నిర్మాణ సంస్థలను కమిషన్ ఆదేశిస్తుంది. నిర్మాణ సంస్థలు అనుమానిత సబ్‌కాంట్రాక్టర్లకు డబ్బు చెల్లించినట్లు ఈ ఆర్థిక నివేదికలు చూపించే అవకాశం ఉంది. నిర్మాణ సంస్థలు ఆర్థిక నివేదికలను కూడా సమర్పించకుంటే.. ఆ వివరాలను కేంద్ర పరిశ్రమల శాఖ నుంచి తీసుకురావాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

తుమ్మిడిహెట్టికి బదులు మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించాలని అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ జస్టిస్ చంద్రఘోష్‌కి తెలిపింది. గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం 2015లో రిటైర్డ్ సీఈలు బి.అనంతరాములు, వెంకటరామారావు, ఎస్.చంద్రమౌళి, రిటైర్డ్ ఎస్ఈలు జి.దామోదర్ రెడ్డి, ఎం.శ్యాంప్రసాద్ రెడ్డిలతో ఏర్పాటు చేసిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ వాదనలు వినిపించారు. జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో శ్యాంప్రసాద్ రెడ్డి మినహా మిగిలిన ఇంజనీర్లు కమిషన్ ఎదుట హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నివేదిక ఇస్తే అప్పటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తిరస్కరించారని, వాటిపై సంతకం కూడా చేయలేదని వివరించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించామన్నారు. మహారాష్ట్రను ఒప్పించి తుమ్మిడిహెట్టి వద్ద 150–151 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించాలని సిఫారసు చేస్తూ అప్పట్లో సమర్పించిన ఈ నివేదిక కాపీని కమిషన్‌కు అందజేశారు. కాగా.. 27 తర్వాత కేసీఆర్, హరీష్‌లకు ఫోన్ చేసే అవకాశం ఉన్నట్లు టాక్ నడుస్తుంది. తదుపరి దశలో అఫిడవిట్లలో వివిధ వ్యక్తులు సమర్పించిన సమాచారం ఆధారంగా బహిరంగ విచారణ, క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించేందుకు కమిషన్ సిద్ధమవుతోంది.




## చిత్తారమ్మ ఆలయంలో షెడ్ ప్రారంభం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** గాజులరామారంలోని శ్రీశ్రీ చిత్తారమ్మ తల్లి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షెడ్ ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. నూతన షెడ్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తారమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, కుత్బుల్లాపూర్ ప్రజల ఇలవేల్పు అయిన చిత్తారమ్మ తల్లి ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్ , కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్ , బాలరాజు, ఇంద్రసేనా రెడ్డి, ఇంద్రసేనా గుప్తా, పెంటారెడ్డి, ఆర్. నర్సింహా, జి. నర్సింహా, లక్ష్మణ్, ఆర్. సత్తయ్య, శ్రీరాములు, క్రిష్ణా రెడ్డి, శంకర్ రెడ్డి, ఆర్. యాదగిరి, ప్రభు గౌడ్, శ్రీరాములు, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## చెరువులను, కుంటలను కాపాడండి

### మంత్రి ఉత్తమ్‌కి హన్మంత్ రెడ్డి వినతి

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న చెరువులు కుంటలు గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతానికి గురయ్యాయని, వాటిని కబ్జాదారుల నుంచి కాపాడి భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి విన్నవించారు. ఆదివారం ఈ మేరకు ఆయన నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రిని కలిసి నియోజకవర్గంలో కబ్జాకు గురైన, గురవుతున్న చెరువులు కుంటల నివేదికను ఆయనకు అందజేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలు చెరువులు రూపు కోల్పోయి కబ్జాకు గురయ్యా అని ఈ సందర్భంగా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు గణేష్, జితేందర్ పాల్గొన్నారు.

## చెన్నారావుపేట తహసిల్‌లో రెవెన్యూ లీలలు!

- ఎలాంటి పత్రాలు లేకుండానే అక్రమ వారసత్వ పట్టా మార్పిడి
- సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి....
- అధికారుల పై చర్యలు తీసుకోవాలని బాధితుడు చెలుకలపెల్లి నరసింహ స్వామి వేడుకోలు

**తెలంగాణ ప్రభ (చెన్నారావుపేట) :** చెన్నారావుపేట తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ లీలలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. కాసులు కురిపిస్తే కాని పని ఏది కాదన్నట్లుగా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ పనుల కోసం తిరిగినా కాని పనులు కాసులు ముట్టజెప్పితే ఏ పనైనా నిమిషాల్లోనే పూర్తవుతుందనే ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. అంతేకాక ఎలాంటి పత్రాలు లేకుండా ఎలాంటి ఆధారాలు చూపకుండా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండానే రెవెన్యూ అధికారులు ఏకంగా అక్రమ వారసత్వ పట్టానే మార్పిడి చేశారు. ఈ సంఘటన సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చింది... వివరాల్లోకి వెళితే.... చెన్నారావుపేట గ్రామ శివారులో చెన్నారావుపేట–నెక్కొండ ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్ కు అతి సమీపంలో సర్వేనెంబర్ 555 లో 38 గుంటల భూమి చెలుకలపల్లి నరసయ్య పేరు మీద ఉంది. ఈయన కాస్తు కబ్జాలో ఉండి 22 డిసెంబర్ 2016వ సంవత్సరంలో అనారోగ్య కారణంతో మృతి చెందాడు. ఇతనికి వారసులు ఎవరూ లేకపోవడంతో నరసయ్య అన్న కుమారుడు నరసింహస్వామి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించాడు. నరసయ్య ఆలన పాలన, బాగోగులు చూసుకొని దహన



సంస్కారాలు నిర్వహించినందుకు గాను ముదిరాజ్ కుల పెద్ద మనుషులు, రక్తసంబంధీకులు నరసయ్యకు చెందిన 38 గుంటల భూమి నరసింహస్వామికి చెందాలని ఏప్రిల్ 9 వ తేదీన 2017 వ సంవత్సరంలో తీర్మాణం చేసి నిర్ణయించారు. కాని ఇది ఇలా ఉండగా నర్సంపేట మండలం మగ్దుంపురం గ్రామానికి చెందిన నూనె ప్రమీల అనే మహిళ చెలుకలపెల్లి నరసయ్యకు నేనే వారసురాలినని ఆ 38 గుంటల భూమిని పసుపు కుంకుమల కింద రాసిచ్చాడని ఓ తెల్ల కాగితం సృష్టించుకుని వచ్చి ఆ భూమిని చెలుకలపెల్లి రాజుకు అమ్మినట్లు మరో తెల్ల కాగితం సృష్టించింది. ఈ రెండు తెల్ల కాగితాలను పట్టుకొని తహసిల్దార్ కార్యాలయంలో సాదా బైనామా కింద చెలుకలపల్లి రాజు 29 అక్టోబర్ 2020 వ సంవత్సరంలో దరఖాస్తు చేశాడు. ఆ దరఖాస్తును రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఎలాంటి పూర్తి ఆధారాలు లేకుండానే చెలుకలపల్లి రాజు పేరుమీద అప్పటి తహసిల్దార్ పూల్ సింగ్ చౌహన్ (ప్రస్తుతం మేడ్చల్ జిల్లా బాచుపల్లి తహసిల్దార్), డిప్యూటీ తహసిల్దార్ మధుసూదన్, గిర్దావర్ స్వామి, సీనియర్ అసిస్టెంట్ సలీం పాషా (ప్రస్తుతం నల్లబెల్లి తహసిల్దార్ కార్యాలయం), ధరణి ఆపరేటర్ సుధీర్ రెడ్డి (ప్రస్తుతం సంగెం తహసిల్దార్ కార్యాలయం), వీఆర్వో ఐలయ్య (ప్రస్తుతం వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం)లు 19 ఫిబ్రవరి 2020వ సంవత్సరంలో అక్రమ వారసత్వ పట్టా మార్పిడిని ధరణి ద్వారా చేశారు. ఉన్న భూమి 38 గుంటలు అయితే 1 ఎకరం 13 గుంటల భూమి ఉన్నట్లుగా అంటే అదనంగా 11 గుంటల భూమిని చెలుకలపెల్లి రాజు పేరు మీద అక్రమంగా ఎక్కించి వారసత్వ పట్టా మార్పిడిని చేపట్టారు. పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ఈతంగానికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విషయాన్ని బాధితుడు చెలుకలపల్లి నరసింహస్వామి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిపాడు. ఈ విషయంపై తహసిల్దార్ కార్యాలయంలో అధికారులను నిలదీసి అడగగా వారసత్వ పట్టా మార్పిడికి సంబంధించిన ఫైలు కార్యాలయంలో లేదని చెప్పడం గమనార్హం. ఎలాంటి పత్రాలు లేకుండా పూర్తిస్థాయి విచారణ చేపట్టకుండా అక్రమ వారసత్వ పట్టా మార్పిడి చేసిన సంబంధిత రెవెన్యూ అధికారుల పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, నర్సంపేట ఆర్డీవోలకు ఫిర్యాదు చేసిన పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నత శాఖ అధికారులు చెన్నారావుపేట తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ లీలలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన రెవెన్యూ అధికారుల పై తగిన చర్యలు తీసుకోని న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు.

# సీనియర్ సిటీజన్స్ సమాజ మార్గదర్శకులు

## విస్మరించేవారు శిక్షార్హులే

### కోరుట్ల ఆర్డీవో ఎన్.ఆనంద్‌కుమార్


**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** సీనియర్ సిటీజేన్స్ సమాజ మార్గదర్శకులని ,వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని,వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని కోరుట్ల ఆర్డీవో ఎన్.ఆనంద్ కుమార్ అన్నారు. కోరుట్లలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12 వ ప్రపంచ వయోధికుల, వేధింపుల నివారణ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీవో హాజరై మాట్లాడారు. సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ పిలుపు పత్రికలను విడుదల చేశారు. వయోవృద్ధుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 14567 ఉందని,వారిని నిరాదరిస్తున్న, వేధిస్తున్న వారిపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు.వేధింపులకు గురిచేసిన వారికి వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం 3 నెలల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే వీలుందన్నారు. డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు పబ్బా శివా నందం ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు వయోధికులకు సేవలు అందిస్తున్నారని,ఎవరైనా వయోవృద్ధ తల్లిదండ్రులు తమ సమస్యల పరిష్కారం కోసం వారు తోడ్పాటు నిస్తారని, గతంలో డివిజన్ లో పరిష్కారం అయిన కేసులను వివరించారు. అనంతరం సీనియర్ సిటీజన్స్ వెంకటేశ్వర్ ,ఆనంద్ ,రాధ ,చిన్నరాజు లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి రాజ్ మోహన్, ఉపాధ్యక్షులు సైఫోద్దీన్ , నల్ల లక్ష్మీ నారాయణ , చిలుక గంగారాం, అల్లూరి బాపూరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మల్లాపూర్ - హైదరాబాద్ బస్సు నడిపించాలి


### రవాణా మంత్రిని కోరిన జువ్వాడి కృష్ణారావు

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండల కేంద్రం నుండి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు ఆర్టీసీ బస్సులు నడిపించాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు కోరారు. ఈ మేరకు హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు అనంతరం విలేకరులతోకృష్ణారావు మాట్లాడుతూ మల్లాపూర్ మండలం నుండి విద్యార్థులు ఉద్యోగులు హైదరాబాద్ లో చదువుకోవడం ఉద్యోగాలు చేయడం ఇతర వ్యాపారాల నిమిత్తం వెళ్తుంటారని, అలాంటి వారికి మల్లాపూర్ నుండి హైదరాబాద్ కు సరైన రవాణా సదుపాయం లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, హైదరాబాద్ వెళ్ళాలి అంటే మూడు బస్సులు మార్చాల్సిన పరిస్థితి ఉందని, కాబట్టి కోరుట్ల పట్టణం నుండిబస్సు బయలుదేరి మల్లాపూర్ మండలం రేగుంట మల్లాపూర్ ముత్యంపేట మీదుగా ఆర్మూర్ నుండి ఒక బస్సు బయలుదేరే విధంగా అలాగే మెటుపల్లి పట్టణం నుండి మరో బస్సు బయలుదేరి మల్లాపూర్ మండలం ముత్యంపేట మల్లాపూర్ రేగుంట గ్రామాల మీదుగా రాయికల్ జగిత్యాల ద్వారా హైదరాబాద్ వెళ్లే విధంగా రెండు బస్సులు నడిపించాల్సిందిగా మంత్రి ని కోరారు. వీటితోపాటు మల్లాపూర్ నుండి మెటుపల్లి వెళ్లే బస్సులు మండలంలోని కుస్తాపూర్ రత్నాపూర్ గ్రామంలో నుంచి నడిపించాలని మంత్రిని కోరారు. ఊరు బయట నుండి బస్సులు వెళ్లడం వల్ల రెండు గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. దీనికి మంత్రి వెంటనే సానుకూలంగా స్పందించి తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశిస్తానని జువ్వాడి కృష్ణారావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



## మెటుపల్లి పట్టణంలో ఉచిత మెగా హెల్త్‌క్యాంపు

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి, నారాయణ మల్టీ స్పెషల్ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన ఫ్రీ మెగా హెల్త్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు దొంతుల ఆంజనేయులు అధ్యక్షతన రిజిస్ట్రేషన్ జనరల్ చెకప్,డెంటల్ చెక్ అప్,గైనాజికల్,కార్డియాలజీ, క్యాన్సర్ స్కానింగ్ ఉచితంగా డాక్టర్స్ రణధీర్ స్వప్న, నికిత, సస్మ్రితి, శిరీష అనిరుద్ చే ఉచిత వైద్యం నిర్వహించారు. ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిస్పీ,డాక్టర్లు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ మెటుపల్లి వారి సహకారంతో పట్టణంలోని గ్రామీణ పట్టణ ప్రజలకు అందుబాటులోకి ఈ ఉచిత క్యాంపు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని లయన్స్ క్లబ్ సేవలు గతంలో విన్నానని చాలా మంచి కార్యక్రమాలు చేశారని పేద విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చలి కాలంలో వృద్ధులకు పంపిణీ, ఉచిత కంటి శిబిరాలు ఏర్పాటు చేయడం ఇతర చలివేంద్రాలు ఆర్థిక సహాయ కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు దొంతుల ఆంజనేయులు,వడ్డేపల్లి శ్రీనివాసన్,ప్రోహార్ తుకారం, గట్ల మారుతి,గడ్డం శంకర్ రెడ్డి గంగుల మురళి, మహాజన్ శివ కుమార్, ఇల్లేందుల వెంకటేష్, కోటగిరి తిరుమలచారి, గంగాధర్ మురళి దశరథం తదితరులు లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.





## సీనియర్ తైక్వాండో కోచ్‌గా నావనంది రమేష్

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ లో ఆదివారం రోజున జరిగిన కోచ్‌స్ అభినందన సభలో జగిత్యాల జిల్లా కోరుట్లకి చెందిన మాస్టర్ తైక్వాండో క్లబ్ ఫౌండర్, నేషనల్ కోచ్, నేషనల్ రిఫరీ అయిన నావనంది రమేష్ కు ఈ సంవత్సర ఉత్తమ సీనియర్ కోచ్ గా అభినందన సర్టిఫికెట్ ని తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కురువ శ్రీహరి, ప్రెసిడెంట్ ముఠా శ్రీనివాస్ చేతుల మీదుగా తీసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ జి సంతోష్ కుమార్, కరీంనగర్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి రాజేందర్, కోచ్ సోయబ్ లు ,తెలంగాణ రాష్ట్ర అన్ని జిల్లాల తైక్వాండో కోచ్ లు, ముఖ్య అతిథులు, అన్ని జిల్లాల సెక్రటరీలు, ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.



## 'చిత్రం' కేఫే ప్రారంభం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ సింహపురి కాలనీ లో సుమంత్, అఖిల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏ ర్పాటు చేసిన 'చిత్రం' కేఫేను కుత్బుల్లాపూర్ హ్యాట్రి క్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడు తూ కాలానుకతీతం గా ఎటువంటి వాతావరణం లోనైనా నడిచే ఏకైక వ్యాపారం 'కేఫ్' అని, నూతన రుచులను వినియోగదా రులకు అందించినప్పుడు వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియ ర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రవి కిరణ్ పాల్గొన్నారు.



## ఫాదర్స్ డే సంబురాలు

**తెలంగాణ ప్రభ, (కోరుట్ల) :** జగిత్యాల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసం ఇందిరా భవన్ లో కాంగ్రెస్ నాయకులు దయాల శంకర్ కుమార్తెలు శ్రీ నిత్య మమత ఫాదర్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కేక్ కట్ చేసి ఫాదర్స్ డే సంబరాలలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పిప్పరి అనిత ఫాదర్స్ డే సెలబ్రేషన్స్ లో పాల్గొన్నారు.

# ‘బాలికలకు భరోసానిద్దాం.. ఉత్తమ మహిళలుగా ఎదగనిద్దాం’

**ఉదయించే కిరణంలా..**
**ఉరికే జలపాతంలా..**
**చైతన్య పథంలో..**
**సాగుతున్న బాలికా..**
**సాగాలి నీవింకా..**
**సాగాలి నీవింకా..**

నేటి సమాజంలో బాలికలు దేనిలో తక్కువ కాదు. అన్ని రంగాల్లో ముందుంటున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు బాలికలు మారాలి. మహిళలు ఏ రంగములో ఎదగాలన్న, అన్ని విషయాల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. మేము అమ్మాయిలం అనే భయాన్ని విడిచిపెట్టి నట్లయితే భవిష్యత్ లో ఉన్నత స్త్రీ గా ఉండే అవకాశం ఉంది. విద్యార్థి దశ నుండే ఈ అలవాటు బాలికలకు కలిగేలా ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు వారిని మానసికంగా బలవంతులను చేయాలి. సమాజంలో బాలికల సంరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి, బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్యా, సామాజికంగా ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఎన్నో అవగాహన సదస్సులు జరుపుతోంది. ఈ కార్యక్రమము స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడుతుంది.

ప్రపంచవ్యాప్తంగా, 129 మిలియన్ల మంది బాలికలు పాఠశాలకు దూరంగా ఉన్నారు, ఇందులో 32 మిలియన్ల ప్రాథమిక పాఠశాల వయస్సు, 30 మిలియన్ల దిగువ-మాధ్యమిక పాఠశాల వయస్సు మరియు 67 మిలియన్ల ఉన్నత-సెకండరీ పాఠశాల వయస్సు ఉన్నాయి.ఆర్థిక,సాంఘిక అభివృద్ధికి ప్రభావితమైన దేశాలలో, ప్రభావితం కాని దేశాలలో నివసిస్తున్న బాలికల కంటే బాలికలు పాఠశాలకు దూరంగా ఉండే అవకాశం రెండు రెట్లు ఎక్కువ.

ప్రపంచవ్యాప్తంగా, 129 మిలియన్ల మంది బాలికలు బడి బయట ఉన్నారు.ప్రాథమిక విద్యలో 49 శాతం దేశాలు మాత్రమే లింగ సమానత్వాన్ని సాధించాయి. మాధ్యమిక స్థాయిలో, అంతరం పెరుగుతతూనే ఉంది.42 శాతం దేశాలు దిగువ మాధ్యమిక విద్యలో లింగ సమానత్వాన్ని సాధించాయి మరియు ఉన్నత మాధ్యమిక విద్యలో 24 శాతం ఉన్నాయి.బాలికల విద్య ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తు అసమానతలను తగ్గిస్తుంది. ఇది మరింత బలపడితే సమాజానికి మంచితో పాటు సామర్థ్యాన్ని పెంచేలా చేస్తుంది.

సమాజం వేగంగా పురోగమించడానికి,భారత దేశం ప్రపంచంలో అగ్రదేశాల జాబితాలో ఉండడానికి ,మానవ వనరుల అభివృద్ధికి విద్యారంగంలో వస్తున్న మార్పులు ముఖ్యమైనవి. భావి భారత పౌరులను తీర్చి దిద్దడములో విద్యావ్యవస్థ కీలకమైనది. బాలలందరికి విద్యను అందించడానికి విద్యాహక్కు చట్టం అమలవుతుంది.దీని ద్వారా బాలికలు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని అవకాశం ఉంది.

దేశాభివృద్ధి జరగాలంటే పురుషులతో పాటు మహిళలు ముందుండాలి. అందుకోసమే బాలికలకు విద్యలో మరియు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తుంది. బాలికల,యువతుల మరియు మహిళల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నది. ఆడపిల్ల పుడితే మహలక్ష్మి పుట్టిందని ఆనందించే వారు కొంత మంది ఉండ వచ్చు, కానీ ఏదో తెలియని బాధ మరికొందరిలో, అయ్యో ఆడపిల్ల పుట్టిందా అనే నిట్టూర్పు ఇంకొందరిలో.

గతంలో భారత ప్రభుత్వం ‘నేషనల్ గర్ల్స్ డెవలప్ మెంట్ మిషన్‘ పేరుతో ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కుడా ఈ విషయంపై పూర్తి బాధ్యత తీసుకొని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ విషయంపై సామాజిక అవగాహనా పెంచి, బాలికలకు విముక్తి కలిగించేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుంది. ఈ అవగాహనను మరింతగా పెంచేందుకు భాగంగా, మన దేశంలో స్ఫూర్తిగొలిపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మహిళా సాధికారతను బాలికల విద్య, పోషకాహారం, న్యాయం, విద్య, సహాయం, సంరక్షణ వంటి అంశాలకు సంబంధించిన కనీస హక్కులపై దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేలా చైతన్యం కలిగించడానికి ప్రయత్నం చేస్తున్నారు.

బాలికల విద్యపై పెట్టుబడి పెట్టడం వల్ల సమాజాలు, దేశాలు మరియు ప్రపంచం మొత్తం రూపాంతరం చెందుతుంది. విద్యను పొందిన బాలికలు ఆరోగ్యకరమైన, ఆదర్శప్రాయంగా నిలిచే జీవితాన్ని గడపడానికి ఎక్కువ అవకాశం ఉంది. వారు కొంత ఆదాయాన్ని సంపాదిస్తు,కుటుంబానికి ఆధారమవుతున్నారు.దీని వల్ల ప్రతి నిర్ణయములో వారి ఆలోచనలు తీసుకొనే అవకాశం ఉంది.వారి ఆలోచనలు తమకు మరియు కుటుంబాలకు మెరుగైన భవిష్యత్తును అందించేలా ఉంటాయని ,వారి అనుభవం,అవగాహన వల్ల కుటుంబానికి మంచి పెరుస్తుంది.

బాలికల విద్యకు అడ్డంకులకు కారణాలు అనేకం.అందులో ముఖ్యంగా పేదరికం, బాల్య వివాహాలు మరియు లింగ ఆధారిత భేదాలు, అవగాహన లోపం వంటివి కారణంగా చెప్పవచ్చు. చిన్నారులను పాఠశాలలో చేర్చేటప్పుడు పేద కుటుంబాలు తరచుగా అబ్బాయిలకు అనుకూలంగా ఉంటూ,ఇంగ్లీష్ కాన్వెంట్ స్కూల్ లో బాలికలను స్థానిక పాఠశాలల్లో చేర్చడం ఇప్పుడుకుడా గ్రామాల్లో నిత్యం కనబడుతుంది.

బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన ఉంటే ఆడపిల్లల పట్ల వివక్ష ఉండదు. కాబట్టి ప్రతి ఒక్కరికి అవగాహన కొరకు ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలి.ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ "ఆడపిల్ల" అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత కూడా అమ్మాయిలకు సమాజములో ఎన్నో ఇబ్బందులు ఎదురవుచున్నాయి. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టి సారించే దిశగా భారత ప్రభుత్వం ‘నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్‘ పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. ఈ కార్యక్రమంలో ప్రజలందరికి ఆడపిల్లల యొక్క గొప్పతనం,వారి ఆవశ్యకతను తెలియ చేసి వారిపట్ల ఉన్న తక్కువ భావనను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.





సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి చాలా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.బాలల విద్యాహక్కు చట్టం అమలు కోసం, రాష్ట్రప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతోంది.అందులో ముఖ్యమైన అంశం బాలికా విద్య.రాష్ట్రంలో ని బాలికలందరికి సమానత్వం, సమన్యాయం,విద్యారంగంలో నే కాకా సామాజికంగా సాధికారత సాధించాల్సిన అవసరం ఉంది.పాఠశాలల్లో బాలికలనమోదు, వారికి నేర్పే పాఠాలు నిజ జీవితములో ఎదురయ్యే సమస్యలను ,సవాళ్ళను తెలివిగా పరిష్కరించుకునే విదంగా ఉండాలి.వివక్షకు, హింసకు,అసమానతలకు గురి అవుచున్న బాలికలను చైతన్యపరుస్తూ,ధైర్యాన్ని కలిగించాల్సిన భాధ్యత మన అందరిమీద ఉంది.

దేశంలో రోజురోజుకి అడపిల్లల సంఖ్య తగ్గిపోతుందని, ఇది ఇలాగె కొనసాగితే చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందిని ఎన్నో సర్వేలు చెపుతున్నాయి. ప్రపంచంలో జరుగుతున్న బాల్య వివాహల్లో 40% పైగా భారతదేశంలోనే జరుగుతున్నాయని ఈ మధ్య యూనిసెఫ్ వారు ప్రకటించారు.ఇప్పటికి చాల రాష్ట్రాల్లో 40%నికి పైగా చిన్నారులు పదో తరగతి కంటే ముందే బడి మానేస్తున్నారు.ఇలా జరగడం వల్ల బాలికలు సమాజములో ముందుండే పరిస్థితి తగ్గుతుంది.

బాలికల సంరక్షన కొరకు కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్రప్రభుత్వాలు వివిధ రకాల పథకాలు ప్రవేశ పెట్టారు. అమ్మాయిల పెళ్లి కొరకు కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా ఆర్థిక సహాయం మన రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. మరెన్నో రకరకాల పథకాలు ప్రవేశపెట్టి బాలికలకు ప్రోత్సాహమిస్తున్నారు.

బాలికల రక్షణకు, బాలికల భ్రూణ హత్యల నివారణకు ప్రభుత్వం "బేటీ బచావో బేటీ పడావో" కార్యక్రమం కింద బాలికల రక్షణ కోసం, వారికి విద్యనందించేందుకు నిత్యం అవగాహన, చైతన్య కార్యక్రమలు అమలు చేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. ప్రతీ వెయ్యిమంది పురుషులకు 940 మంది మాత్రమే మహిళలు ఉన్నారు. అలాగే, 6 సంవత్సరాల లోపు ఆడపిల్లలైతే ప్రతి 1000 మంది మగ పిల్లలకు 914 మంది మాత్రమే ఉన్నారు.గత పది సంవత్సరాల కాలంలో సుమారు 30 లక్షల మంది బాలికల సంఖ్య తగ్గింది. దీంతో బాల బాలికల లింగ నిష్పత్తిలో వ్యత్యాసం బాగా పెరిగింది.మొత్తం జనాభాలో బాలికల సంఖ్య తగ్గిందని కేంద్ర గణాంక శాఖ విడుదల చేసిన ‘చిల్డ్రన్ ఇన్ ఇండియా – ఏ స్టాటిస్టికల్ అప్రైజల్’ అనే నివేదిక ద్వారా తెలియపరిచారు.

ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టి బాలికలకు తోడ్పాటును అందించిన కూడా మంచి మార్పు కావాలంటే మాత్రం తల్లిదండ్రులు, సమాజ సహకారాలు,బాలికల్లో మార్పు కూడా తప్పక అవసరం.ఆర్థిక పరిస్థితుల కారణంగా బాలికలైతే భారమని, మగపిల్లలైతే బాగుంటుందనే భావన నుండి తల్లిదండ్రులు మరియు సమాజము బయటకు రావల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం మనం ప్రాథమిక పాఠశాలల్లో 98% నమోదును సాధించాం. కానీ ప్రాథమిక విద్య స్థాయిలోనే దాదాపు 20% మంది పిల్లలు బడి మానేస్తున్నారు. సెకండరీ విద్యా స్థాయిలో వారి సంఖ్య 40% శాతంగా ఉన్నది. ఇలా మధ్యలో బడి మానేసే పిల్లల్లో ఆడపిల్లలే ఎక్కువ. ప్రాథమిక స్థాయి కంటే సెకండరీ స్థాయిలో ఆడపిల్లలు ఎక్కువగా డ్రాపౌట్ లుగా మిగిలిపోతున్నారు.

అనాదిగా ఆడపిల్లలపై వివక్ష ఉన్నదని అనుకుంటే వీరనారీమణులు, రాజనీతిజ్ఞులు,మహిళా శిరోమణులు మనకు ఎలా తయారయ్యారు. ప్రస్తుతం డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, సైంటిస్టులుగా, అధికారులుగా, పారిశ్రామిక వేత్తలుగా, విద్యావేత్తలుగా, పోలీసు ఆఫీసర్లుగా, సైన్యంలో కెప్టెన్లుగా, విమానాలు నడిపే పైలెట్లుగా సరిహద్దుల్లో పోరాడే వీరజవాన్లు,గా మహిళలు ముందుకు వస్తున్నారు. పురుషులు పని చేసే అన్ని రంగాల్లో మహిళలు కూడా పని చేస్తున్నారు.. “ఎప్పటికైనా ఆడపిల్ల ఆడపిల్లేగాని ఈడపిల్ల కాదుకదా” అనే మాట నుండి బయటపడి,జాతికి వెలుగునిచ్చే మహిళమణులుగా ఎదగాలి.

**‘ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం..**
**చదవనిద్దాం.. ఎదగనిద్దాం..**
**ఉత్తమురాలుగా ఉండనిద్దాం’**

గడప రఘుపతిరావు
+91 99634 99282
raghupatiraog@ gmail.com

